# ఉద్యోగపర్వం: సున్నపుపిడత

తూలికాభూషణ్



**రోగికి కావలసింది అది.**

**వైద్యుడు చెప్పేదీ అదే.**

**అయినప్పుడు రోగికి రుచించకపోవడం అరుదు.**

నాకు ఉద్యోగం చాలా చాలా అవసరం. నన్ను ఎంత త్వరగా వీలయితే అంత త్వరగా ఇంట్లోంచి మాత్రమే కాదు, ఆ ఊళ్ళోంచే పంపేయడం మా మామయ్యకు చాలా చాలా అవసరం.

అంటే మా మామయ్య ఒక రాక్షసుడని. నేనా రాక్షసుడి బారినిపడ్డ బలిపశువునని అనుకునేరు. అంతకంటె పొరపాటు మరొకటి ఉండదు.

నిజం చెప్పాలంటే నేనొక రాక్షసుణ్ణి. మా మామయ్య ఒక దేవుడు. నన్నొక నరకంలోనించి బయటపడేయాలని సంవత్సరాలుగా తాపత్రయపడుతున్న అమృతహృదయుడు. చాలు. ఇంతకన్న మా మామయ్యను పొగడవలసిన పనిలేదు.

నేను చదివిన చదువుకు నెలకు కేవలం ఇరవై రూపాయలు పైతం ఇచ్చి కొలువులో పెట్టుకొనే ఉదారుడు. ఆంధ్రదేశం నలుమూలలా అయిదు సంవత్సరాలు అన్వేషించినా కంటికి కనుపించని పుణ్యకాలమది.

నేను ఏకైక కుమారుణ్ణి. అల్లారుముద్దుగా పెరిగిన వాణ్ణి. అలా పెంచుకొనే ప్రేమను కలిగిన తండ్రి బిడ్డనంటే వాస్తవానికి చాలా చాలా దగ్గరగా ఉంటుంది.

అంతే అయితే ఫరవాలేకపోను. తండ్రికంటె ఎన్నో రెట్లు భాగ్యవంతులయిన మాతామహుల మొదటి మనవణ్ణి-ముద్దుల మనవణ్ణి.

అసలే కోతి....అన్నది నా విషయంలో అక్షరాల నిజమయింది.

అంతే అయితే కథ లేకపోనేమో! తండ్రిని. మాతామహుల్ని కూడా ఏకకాలంలో పోగొట్టుకున్నాను. మామయ్య పాలపడ్డాను.

తరిపి గేదె దూడలా నన్ను మేపడానికి మా అత్తయ్యకు ఆక్షేపణ లేదు. నిజానికి ఆవిడ చేతికి ఎముక లేదు.

కాని—

అమృతహృదయుడైన మామయ్య ప్రేమలో మునిగి తేలుతూ, దున్నలా బలిసి కొవ్వెక్కి కళ్ళు కానక నేను వేసే వెధవవేషాలు భరించే పాటి సహనం ఆవిడలో నశించి చాలా కాలమయింది.

అత్తయ్యను ప్రోపిరాజనే శక్తి మా మామయ్యకు లేదు.

నిప్పు రాజుకుంది. తెల్లవారడం తరువాయి మొదలయి ఊరు మాటుమణిగేవరకు నిరంతరాయంగా నిత్యమూ సాగుతున్న గొడవలు సర్దేశక్తి మామయ్యలో ఇంకలేదు.

భయంకరమైన పరిణామం ఏదో రాకముందే నన్ను అక్కడినించి తప్పించివేస్తే మంచిదని మా మామయ్య నిశ్చయించాడు. నా స్వభావం మామయ్యకంటె బాగా తెలిసినవాళ్ళు ఎవరూ లేరు. నేను — ఆత్మగౌరవానికి దెబ్బ తగిలే పక్షంలో ఎంతటి అఘాయిత్యానికయినా వెనకాడనని మామయ్యకు తెలుసు.

బ్రతికి ఉంటే ఎక్కడో అక్కడ బలుసాకు తింటానని మామయ్య ఆశ.

తండ్రితోబాటు సర్వస్వమూ పోగొట్టుకొన్న మనిషిని. బలుసాకు తినటానికి అయినా ఏదో ఒక ఆధారం అవసరం.

ఇంట్లో స్థితిగతులు, మనుషుల తత్త్వాలు రాగల భయంకర పరిణామాలు నాకు తెలియవనికాదు. బయటపడాలంటే నాకు ఉద్యోగం ఒకటి అవసరం.

మరిచాను- ఈ మధ్యకాలంలో నా జీవితం ఒక ముఖ్యమైన మలుపు తిరిగింది.

బెండకాయని, బ్రహ్మచారిని ముదరనివ్వని తత్త్వం రక్తంలో జీర్ణించుకొన్న జాతికి చెందినవాడు మా మామయ్య. నా అదృష్టం ఫలించి ఆడపిల్లలు లేనివాడు. లేకపోతే అత్తయ్య కడుపున పుట్టి, అత్తయ్య గుణగణాలు పుణికి పుచ్చుకొన్న ఆడపిల్లను చేసుకొంటే- అమ్మో! అలాంటి జీవితం ఊహించడానికి కూడా భయంకరమైనదే కదా!


చదువు చెప్పించిన వాడు మా మయ్య. పెళ్ళి చేసి నా మెడకో గుదిబండ తగిలించి ఆ బాధ్యత కూడా యధావిధిగా నిర్వర్తించాడు.

అది మేళ తాళాలతో, పల్లకిలో ఊరేగడం కాదని, మెడకో గుదిబండ జీవితాంతం తగిలించుకోవడమని ఆ తరవాత చాలా కాలానికి కాని నాకు తెలిసిరాలేదు. ఏం లాభం? అప్పటికే చేతులు కాలిపోయాయి. సరి. అది వేరే సంగతి.

పిల్లనిచ్చిన మామగారికి కూడా బాధ్యత ఉంటుంది కదా? ఆయన, పాపం! తన బాధ్యత పరిపూర్ణంగా నిర్వర్తించుకొన్నాడు. ఎన్ని ఉద్యోగాలో వేయించాడు. ఒక్కదానిలోనూ నేను నిలదొక్కుకోలేకపోయాను. కారణాలు ఏమైతేనేమి? నేను నిరవాకం చేయలేకపోయాను.

పిల్లనిచ్చిన మా మామగారి మాటల్లో చెబుతాను:

"ఎర్రగా బుర్రగా ఉన్నాడు. కాస్తో కూస్తో చదువుకున్నాడు. ఎవరినడిగినా తెలివైనవాడని అంటారు. అన్నిటినీ మించి సంప్రదాయమైన కుటుంబంలో పుట్టాడు. పెళ్ళానికి ఇంత కూడు పెట్టలేకపోతాడా అనుకొన్నాను. నమ్మాను. ఏరి కోరి కూతుర్ని ఇచ్చి పెళ్ళి చేశాను. పెళ్ళి చేశాను అనడం కంటె నా కూతురు గొంతు స్వయంగా కోశానంటే బాగా ఉంటుంది. నిజానికి దగ్గరగా ఉంటుంది" అని. నేను వినాలని ఆయన గొంతు హెచ్చించి ఎవరితోనో అన్నాడు. ఆయన కోరుకొన్నట్లుగానే నేను విన్నాను. పూర్తిగా ఆయనతో ఏకీభవించాను.




నేనంటే అంతటి సదభిప్రాయం ఉన్న మా మామగారు ఆఖరి ప్రయత్నంగా నాకొక ఉద్యోగం సంపాదించిపెట్టారు. దానితో తత్కాలంగా మా మామయ్య సమస్యకు పరిష్కారమూ లభించింది.

తత్కాలంగా అని ఎందుకు చెప్పవలసి వచ్చిందంటే— నాలాంటివాడి సమస్యలు శాశ్వతంగా పరిష్కరించేశక్తి నన్నుపుట్టించిన బ్రహ్మకుకూడాలేదు. నా పేరే సమస్యాతోరణం.

పీఠికాపురంలో ఇద్దరు దొరలు రామారాయణింగారు వెంగళ రాయణింగారు ఒక కంపెనీ స్థాపించారు. ఆ కంపెనీ బ్రాంచి ఆఫీసులు తునిలోను, రామచంద్రపురంలోను నెలకొల్పారు.

రామచంద్రపురం బ్రాంచి ఆఫీసు మానేజరు పదవి అలంకరించడానికి మా మామగారి కోరికపై నన్ను ఎన్నుకొన్నారు. ఆ పదవి అలంకరించడానికి నాకు ఉన్నఅర్హత గొప్పది. రామారాయణింగారు, మా మామగారు ఒక ఊరివారు. పైగా క్లాస్‌మేట్సు. ప్రాణమిత్రులూను.

అదొక ఎలెక్ట్రికల్, మెకానికల్, రేడియో ఇంజనీరింగు కంపెనీ.

జీతం నెలకు ఇరవై రూపాయలు. ఒక కుటుంబం సాఫీగా బ్రతకడానికి చాలును. అలాంటి పుణ్యకాలమది.

దారి ఖర్చులకు, ఒకనెల రోజులపాటు బ్రతకడానికి చాలినంత డబ్బు అత్తయ్య ఆమోదంతో ఇచ్చి, వెంటనే నన్ను జట్కాబండిలో రామచంద్రపురం- చెప్పలేదు కదూ? మా వూరు ద్రాక్షారామం రవాణాచేసి, చేతులు కడుక్కున్నాడు మా మామయ్య.

రామచంద్రపురంలో ఒక హోటల్‌లో ఉండటానికి గది దొరికింది. తిండి, టిఫిను, కాఫీ అన్నీ అక్కడే. ఆఫీసుకికూడా దగ్గరలోనే ఒక గది దొరికింది.

ఉద్యోగం బాగానే ప్రారంభమయింది. ఆ చుట్టుపక్కల గ్రామాలలో విశేషమైన పలుకుబడి ఉన్న సుబ్బరామయ్యగారితో పరిచయమైంది. ఆ ప్రాంతంలో ఆయనను చిన్నబాబుగారంటారు.

సుబ్బరామయ్యగారు నన్ను మొదట మండపేట తీసుకువెళ్ళారు. ఇతరవిషయాలకేమికాని ఆయన పలుకుబడి మండపేటలో కళావంతుల కుటుంబాలలో అత్యధికమని ఆ మొదటి వ్యాపార పర్యటనలో తెలుసుకొన్నాను!

బోణీ కూడా సుబ్బరామయ్యగారిదే. ఆయన భార్య కోసం ఒక రేడియో— ఆ రోజుల్లో ఒక ఫైవ్ వాల్వ్, త్రీ బాండ్ జి.ఇ.సి. రేడియో ఖరీదు నూట ఇరవై రూపాయలు- కొన్నారు. తాను ఉంచుకొన్న మండపేట ఆవిడకోసం ఒకటి కొన్నారు.

అలాగే స్నేహితులతో చెప్పి నాలుగు రేడియో సెట్లు కొనిపించారు.

ఆ ఒక్క రోజు నేను మా కంపెనీకి సంపాదించిపెట్టిన లాభం నూట ఎనభై రూపాయలు. రేడియో సెట్టు ఒకటికి లాభం ముప్పై రూపాయలు.

అలాగే వేరొక వంక ఇంజన్ల విక్రయానికి నాంది ప్రస్తావన జరిగింది. దానికి కూడా పుణ్యం కట్టుకొన్న పెద్దమనిషి సుబ్బరామయ్యగారే.

ఈలోగా ఏర్పడిన పరిచయాలు కొన్ని స్నేహాలుగా పరిణమించాయి.

మోతుబరి భూస్వామి సోమేశ్వరరావుగారితో అనుకోకుండా పరిచయం లభించింది.

"సిరికలవానికి చెల్లును...." అన్న శ్రీనాథుని పద్యం మోతుబరి భూస్వాములకు వర్తించదు. సోమేశ్వరరావుగారు ఇద్దరు భార్యల భర్త. ఇంకొక విధంగా చెప్పాలంటే ఆయనకు ఇద్దరు భార్యలు—మరే విధంగా చెప్పినా ఆయన గౌరవానికది భంగకరం కదా?

సోమేశ్వరరావుగారి ముద్దుల భార్య-అంటే రెండవ భార్య-పొరుగింట నేను ఎలక్ట్రికల్ వైరింగు చేయిస్తున్నానని విని భర్తతో చెప్పింది. నాకు కబురు పెట్టించింది. ఫలితంగా ఆ మోతుబరి భూస్వామి ఇంట ఒక వెయ్యి రూపాయల పైచిలుకు వైరింగు చేయించే అవకాశం నాకు లభించింది.

అడ్వాన్సు ఇచ్చేటప్పుడు ఆయన "నీ పేరేమిటోయ్?" అని అడిగారు.

చెప్పాను.

"మీ ఇంటి పేరేమిటి?" అని అడిగారాయన.

మాట తప్పించాను.

ఆ తరవాత మా ఇంటి పేరు ప్రసక్తి రాకుండా జాగ్రత్తపడ్డాను. పని పూర్తిగా మా కంపెనీ పనివాళ్ళకు అప్పగించి, సోమేశ్వరరావుగారు ఇంట్లో లేనప్పుడు మాత్రమే అక్కడికి వెళుతూ అజమాయిషీ సాధ్యమైనంత త్వరగా ఆయన ఇంట పని పూర్తి చేశాను. మళ్ళీ ఆయన కంటపడకుండా తప్పించుకొన్నాను.

నా ప్రవర్తనకు కారణం లేకపోలేదు.

అప్పటికి మా నాయనమ్మగారు ఇంకా బ్రతికే ఉన్నారు. సాక్షాత్తు ఆమె చెల్లెలి కొడుకే ఈ సోమేశ్వరరావుగారు. వయసులో మా నాన్నగారికంటె చిన్నకనక నాకు బాబయ్యగారు అవుతారు.

నేను రామచంద్రపురంలో ఏదో ఒక కంపెనీలో పనిచేస్తున్నట్లు ఎలాగో తెలుసుకొంది మా నాయనమ్మగారు. ఇంకేమి? మేనమామ కబంధ హస్తాలనించి బయటపడ్డానని ఆనందించింది. ఆవిడ దృష్టిలో మా నాన్నగారి అత్తవారికి గుడ్డిగవ్వంత గౌరవంలేదు. పైపెచ్చు మా కుటుంబంలో సంభవించిన అనర్థాలన్నిటికీ మా మాతామహుల కుటుంబమే కారణమని ఆమె నమ్మకం. మా నాయనమ్మ అభిప్రాయాల్ని, నమ్మకాలు మార్చేశక్తి ఆ పరమేశ్వరునికి సైతం లేదు.

విముక్తుడైన మనవడి యోగక్షేమాలు కనుక్కొని తెలుపమంటూ మా నాయనమ్మ సోమేశ్వరరావుగారికి వ్రాసింది. ఆయన రెండు పర్యాయాలు మా కంపెనీకి వచ్చారు. నా పేరు కలవారు ఇద్దరు ఉన్నారని. ఆ రెండవ వ్యక్తి సోమేశ్వరరావుగారి బంధువు అని. కాస్త వ్యవధి చిక్కగానే ఆయన ఇంటికి పంపుతానని ఎలాగో నమ్మ పలికి ఆయనబెడద అప్పటికి వదిలించుకొన్నాను.

సోమేశ్వరరావుగారి ఇంటి పని పూర్తి చేసి రావలసిన డబ్బు తీసుకొనడానికిఆయన ఇంట్లో ఉన్నప్పుడే వెళ్ళవలసి వచ్చింది. ఆ రోజు సుబ్బరామయ్యగారితో కలిసి మళ్ళీ మండపేట వెళ్ళి, తిరిగి వచ్చేదారిలో సోమేశ్వరరావుగారి ఇంటి దగ్గర దిగబెట్టి వెళ్ళమని ఆయన్ను అడిగాను. ఎక్కడికి కలిసి వెళ్ళినా సుబ్బరామయ్యగారి స్వంత గుర్రం బండిలోనే.

"సోమేశ్వరరావు గారూ, నేనూ లంగోటి యార్లం తెలుసా? ఆయన్ను చూసి చాలా కాలమైంది. పద నేనూ వస్తాను" అన్నారు సుబ్బరామయ్యగారు.

సోమేశ్వరరావుగారుఇంట్లోనే ఉన్నారు. కుశల ప్రశ్నలు ముగిశాయి. అతిధి సత్కారాలు పూర్తి అయ్యాయి. నాకు నా కంట్రాక్టుకు సంబంధించినంత మట్టుకు ఇచ్చి పుచ్చుకోవడాలు కూడా ముగిశాయి. ఇంక సెలవు తీసుకోవడమే తరవాయి.

సుబ్బరామయ్యగారు ఘటికుడు. అంత వరకు సోమేశ్వరరావుగారిని, నన్ను పరిశీలిస్తు ఉన్నాడా పెద్దమనిషి.

"ఇంతకి ఈ కుర్రాడెవరో తెలుసురా నీకు, సోమూ?" అని అడిగాడు.

సోమేశ్వరరావుగారు నవ్వారు—పడిపడి.

"అదేదో సామెతలా ఉందిరా. ఓ ప్రశ్న సుబ్బూ. తల్లి పుట్టిల్లు మేనమామకి తెలియదుట్రా! మా ఇంట్లో దాదాపు రెండువేల రూపాయల కంట్రాక్టుచేశాడు. బుద్ధిమంతుడు. చాకులాంటివాడు. నెల్లాళ్ళనించి చూస్తున్నాను—నాకు తెలియకపోవడమే మిట్రా!" అన్నారాయన.

"మీ ఇద్దరి వాలకమూ, మాట్లాడుకొనే పద్ధతీ అన్నీ చూసే అడిగాను. నువ్వూ, ఇతను బంధువులు. వరసకి నీకు కొడుకవుతాడు"—అన్నారు సుబ్బరామయ్యగారు.

సోమేశ్వరరావుగారు ప్రళయకాల రుద్రుడి అవతారం ఎత్తారు. నా కోసం తాను సాగించిన అన్వేషణ, నేను చేసిన మోసం-అంతా సవిస్తరంగా చెప్పుకు వచ్చారు. సుబ్బరామయ్యగారు కూడా కష్టపెట్టుకొన్నారు.

నాకు బంధువులంటే ఎలర్జీ, బంధువుల చేతుల్లో నేను పొందిన గౌరవ మర్యాదలు అంతటివి. సోమేశ్వరరావుగారు భాగ్యవంతులు. నేనుకానీకి తికానాలేని దరిద్రుణ్ణి.


చర్మ రోగం సోకిందా?



ఉపశమనం కలించే లిచెన్‌సా స్కిన్ అయింటుమెంటు నిరపాయకరంగా, శీఘ్ర నివారణ కలిగిస్తుంది.

రుజువు చేయబడిన 6 మందులుతో కూడిన నిరపాయకరమగు నాజూకైన మలాము అమోఘంగా పనిచేస్తుంది చర్మరోగాలకు, కోతలకు, పుండ్లకు...మరియు మొటిమలకు, చమటకాయలకు పొడుపుడుకాయలకు!

చర్మరోగాలు కన్పించీ కన్పించడంతోటే నిరపాయకరమైన శీఘ్ర నివారణకు లిచెన్‌సా వెంటనే ఉపయోగించండి.

లిచెన్‌సా
స్కిన్ అయింటుమెంటు
7 TG.A

లతకు పందిరే అందం. మహిళకు
శ్రీ ఆభరణములే అందం.





22c.t. బంగారు కవరింగ్ చేయబడినవి
ESTD:1964, Grams: SREEGOLD
PHONES: OFF: 2235 RES: 785
తయారు చేయువారు:
శ్రీగోల్డు కవరింగ్ వర్క్సు
REGD
P.B. NO. 35, శ్రీమహల్, మచిలీపట్నం. A.P
VIJAYA/MPM

దుప్పట్లా?
అందమైన డిజైన్లకు,
గ్యారంటీ రంగులకు,
మన్నికైన నూలుకు,
ఉత్పత్తి ధరలకు....
మెట్రోటెక్స్
12, సత్యా కాంప్లెక్స్, కాళేశ్వరరావురోడ్
విజయవాడ-2

## నిస్సహాయ

గుండె తడబాటు కలానికేం తెలుసు?
అది ముందుకుపోతానంటోంది ఎటో
మనసులోని భావన అక్షరరూపం దొరక్క.



గొంతు కడ్డంపడి కొట్టుకుంటో.
నలిగి మెలితిరిగి. తిరిగి గుండెలోతుల్లోకి.
దాచ్చుకుపోతానంటో మారాంచేస్తోంది.
ఏంచెయ్యను. మరి నే నిస్సహాయను.

—ఎన్. అనూరాధ

కావాలని దూరంగా ఉండిపోవటానికి ఇంత కన్న మరొక కారణమేమీ లేదని యథాశక్తి నచ్చచెప్పాను. సోమేశ్వరరావుగారంటే నాకెంత గౌరవం ఉందో నొక్కిచెప్పాను.

ఉభయులూ వయసులో పెద్దలు. అనుభవజ్ఞులు. అర్థంచేసుకొనగలశక్తిఉన్నవారు- అర్థం చేసుకొన్నారు.

"సరే. జరిగిందేదో జరిగిపోయింది. నేను బ్రతికి ఉండగా. నా ఊళ్ళో నువ్వు ఒక హోటల్‌లో బసచేయవలసిన దుర్గతి లేదు. వెంటనే నా ఇంటికి - నా ఇల్లేమిటి? మన ఇంటికి మకాం మార్చేయి" అన్నారు సోమేశ్వరరావుగారు.

సుబ్బరామయ్య గారు సరేసరి - ఇంక క్షణం కూడా ఆలస్యం చేయకూడదన్నారు.

ససేమిరా రానన్నాను.

వాదోపవాదాలు. చర్చలు అయిన తరవాత ఒక పూట సోమేశ్వరరావుగారి ఇంట భోజనం చేయడానికి అంగీకరించాను. సోమేశ్వరరావుగారు అల్ప సంతోషి. ఆ మాత్రానికే పొంగిపోయారు. ఆయన బంధుప్రేమ కూడా గొప్పదే.

ఆమరునాడు సోమేశ్వరరావుగారి మొదటి భార్య ఇంట భోజనం చేశాను. సుష్టుగా.

మళ్ళీ గొడవ మొదలైంది.

ఎలక్ట్రికల్ కంట్రాక్టులోనే అదే బాధ పడ్డాను. లైట్లు. ప్లగ్‌పాయింట్లు. బ్రాకెట్లు. ఫానులు ఒక్కటి కూడా తేడా రాకూడదు. ఇద్దరు భార్యల వాటాల్లోనూ. ఎలాగో మాట పడకుండా పని పూర్తి చేశాను.

ఇప్పుడు మరొక రకం బాధ.

రెండవ భార్య ఇంట కూడా భోజనం చేయాలని సోమేశ్వరరావుగారు పట్టుబట్టారు. "లేకపోతే ఎలాంటి బాధలు వస్తాయో నువ్వు అర్థం చేసుకోలేవురా బాబూ" అన్నారాయన. అప్పటికే చనువుగా 'ఒరేయ్ బాబూ' అనడం మొదలుపెట్టారు సోమేశ్వరరావుగారు.

ఒప్పుకొన్నాను. అయితే వాయిదా వేశాను, చేతిలో ఉన్న మరొక ఎలక్ట్రికల్ కంట్రాక్టు పూర్తి అయ్యేవరకు. ఆయన సరే అన్నారు. నాకు సోమేశ్వరరావుగారి రెండవ భార్య చేతి వంట రుచి చూసే మహాభాగ్యం నుదుట లేదు కాబోలు—

జీవితం మళ్ళీ మలుపు తిరిగింది.

ఉన్న డబ్బు. దస్కం. సామాను. పనిముట్లు అన్నీ పట్టుకొని పనివారితో కలిసి వెంటనే హెడ్ ఆఫీసుకు రమ్మని టెలిగ్రామ్ వచ్చింది.

పనివారు-ఇద్దరు ఎలెక్ట్రిషియన్లు ఎప్పటినించో సెలవు కావాలంటున్నారు. ఇద్దరూ పిఠాపురంవాళ్ళే. వాళ్ళకు ఇవ్వవలసిన పైకం ఇచ్చేసి. సామానూ అదీ తీసుకొని హెడ్ ఆఫీసుకు బయలుదేరాను.

నాలో అనుమానం ఏమీలేదు.

కాని—

మరునాడు మామామగారితోకలిసి కంపెనీ హెడ్ ఆఫీసుకు వెళితే నా అదృష్టం మరొకసారి నన్ను వంచించిందని తేలిపోయింది.

కంపెనీ దివాలా తీసింది.

తుని బ్రాంచివాళ్లు సరుకుతోసహా పరారి అయ్యారు.

ఆఖరికి వున్న ఊళ్ళో హెడ్ ఆఫీసులో సైతం మోసం అయిపోయింది.

"డబ్బుకి డబ్బు. సరుకుకి సరుకు అన్నీ అప్పచెప్పిన నీతి. నిజాయితీ నీకు ఒక్కడికే వుంది" అని మానేజింగ్ పార్ట్‌నర్ వెంగళరాయణింగారు నన్ను మెచ్చుకున్నారు.


"మళ్ళీ మంచిరోజులు రాకపోవు. కలుద్దాము. పోయిరా. బాబూ" అన్నారు.

చెప్పవద్దూ? నాకు ఒళ్ళుమండింది. మూడు నెలలు చాకిరీ చేశాను. లాభం పుష్కలంగా ఆర్జించి పెట్టాను. ఇంతవరకు చిల్లికానీ జీతంఇవ్వలేదు. "పైగా పోయిరా. బాబూ" అంటున్నాడు పుణ్యాత్ముడు.

నా జీతం నాకు ఇమ్మని నిలదీశాను.

మూడు నెలలపాటు ఒక హోటల్‌లో ఉండి తిండి తిన్నందుకు డబ్బు చెల్లించవలసిన అగత్యం ఉందని. లేకపోతే నేను రామచంద్రపురం విడిచిపోవడం సాధ్యం కాదని చెప్పాను.

అంతా విని మానేజింగు పార్ట్‌నర్ చెప్పారు—"బాబూ! ఇప్పటి స్థితిలోనించి బయటపడడం ఎలాగో తెలియక కొట్టుకుచస్తున్నాము. ఉన్న పొలం గట్రా అమ్మి అయినా దీనిలోనించి బయటపడలేమే అనిపిస్తూంది. నీ హోటల్ బిల్లు మేము చెల్లిస్తాము. ఇప్పుడు మేము చేయగలిగిందేమీ లేదు. మా గౌరవం నిలబెట్టు— మా ఆస్తిపాస్తులు ఎలాగూ నిలబడవు. అందుకు నువ్వేమి చేయనూ లేవు. మాకే దారిలేనప్పుడు మేము నీకు చేయగలిగిందేమీ లేదు.



మా మాట విని ఇప్పటికి మమ్మల్ని ఇలా విడిచివెళ్ళు. అదే మాకు పది వేలు" అని.

మా మామగారు కూడా ఆయన మాటలు నమ్మి అని ఆయన్నే బలపరిచారు.

మానేజింగు పార్టనర్ నాతోపాటు ఒక మనిషిని రామచంద్రపురం పంపి. హోటల్ యజమానికి చెప్పించారు. నాకు అయిన మొత్తం తాము చెల్లిస్తామని.


హోటల్ యజమాని స్వతః మంచివాడు. ఒప్పుకొన్నాడు. గది ఖాళీ చేసి మళ్ళి స్వగ్రామం చేరుకొన్నాను. ఈ సారి అత్తయ్య. మామయ్య కూడా లబోదిబో మన్నారు.

మళ్ళి ఎప్పటిలా వేట మొదలయింది. ఉద్యోగ ప్రయత్నాలు. వైఫల్యాలు నాకు అలవాటేకదా ?

చివరికి మా మామయ్యకు ఒక ఆలోచన తట్టింది.

మేల్ నర్స్ కోర్సుకు దరఖాస్తులు కోరుతూ ప్రభుత్వం ఒక ప్రకటన చేసింది. దానిలోచేరితే ఏదో ఒక ఆధారం దొరుకుతుందని మా మామయ్య అనుకొన్నాడు.

దరఖాస్తుతోబాటు ఒక సివిల్ సర్జన్ మెడికల్ సర్టిఫికెట్ జతపరిచి పంపాలట. అందుకు కాకినాడ వెళ్ళవలసివచ్చింది. చేతినిండా డబ్బు ఇచ్చివెళ్ళి పనిపూర్తిచేసుకొని




రమ్మని పంపాడు మామయ్య.

సర్టిఫికెట్ పని పూర్తి అయింది.

మెయిన్ రోడ్ లో పోతున్నాను అత్తయ్య పురమాయించిన సరుకులు కొనడానికి.

రామచంద్రపురం హోటల్ యజమాని పెద్ద మసీదు దగ్గర ఎదురయ్యాడు.

కనుపిస్తూనే ఎడమచేత్తో నా మెడ బట్టుకొన్నాడు. కుడి చేత్తో మొలలోంచి కైజారు తీశాడు. నడిరోడ్డు. పట్టపగలు. పదిమందీ చూస్తూ ఉండగా నా మోసం నా కంపెనీ మోసం ఏకరువుపెట్టాడు. అప్పటికి ఆరు నెలలయింది పాపం! మా కంపెనీ వాళ్ళు వాగ్దానం చేసి. డబ్బు ఇవ్వలేదట.

"మర్యాదగా నాకివ్వాలిసిన డబ్బులు పారేయి. లేకపోతే నిన్ను చంపి ఇక్కడ పాతిపెడతాను" అన్నాడు ఖండితంగా. కైజారు ఆన్చాడు.

మామయ్య ధర్మమా అని జేబులో డబ్బు ఉంది గనక ఇచ్చి బయటపడ్డాను.

ప్రాణందక్కిందికాని తరవాత అత్తయ్య చేత మాటలు పడేయోగం ఎలాగూ తప్పలేదు.

"సున్నపు పిడత" అన్న బిరుదూ తగిలించుకొన్నాను. ●

18%

18 శాతం వడ్డీ
ప్రతి నెలా చెల్లింపు

మా లార్సవిన్ ఇండస్ట్రియల్ ఫైనాన్స్ డిపాజిట్ పథకంలో మూడు సంవత్సరాల డిపాజిట్లుకు సంవత్సరానికి 18 శాతం వడ్డీ లభిస్తుంది. ప్రతినెలా వడ్డీ చెల్లించబడును.

మా వివిధ పథకాల వివరాలకోసం ఈ కూపను నింపి, క్రింది చిరునామాకు నేడే పంపండి.

Larsvin Finance
315, 'Chandralok', Sarojini Devi Road, Secunderabad-500 003

Name: ____________________
Address: ____________________
____________________

Larsvin

| | ఫోను: | | ఫోను: | | ఫోను: |
|---|---|---|---|---|---|
| విజయవాడ — | 61473 | విశాఖపట్నం — | 66366 | గుంటూరు — | 23439 |
| ఒంగోలు — | 2737 | నెల్లూరు — | 4284 | తెనాలి — | 3774 |